# జగత్తు జగదీశ్వరుని ఆకారమే!

**తెలియబడుచున్న దివ్యంబె దృశ్యమందు**
**తెలివినై సర్వమునుగాంచు ద్రష్ట నేను**
**మిగుల నాకంటె అన్యంబు యేదిలేదు**
**సత్యమిది సర్వవేదాంత సంగ్రహంబు**
**నపుణ్యం నపాపం నసౌఖ్యం నదుఃఖం**
**నమంత్రో నతీర్థో నవేదా నయజ్ఞం**
**అహం భోజనైవ నభోజ్యం నభోగిం**
**సచ్చిదానందరూపం అద్వైతం సత్యంశివంసుందరం**

దివ్యాత్మ స్వరూపులారా!

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'. లోపల, వెలుపల అంతట వుండిన పరమపురుష తత్త్వాన్ని యెక్కడ వెతకటం? మహిని సర్వంబు ఈశ్వరమయము. కనుక, 'నాది' అను అభిమానము అనర్థంబు. ఇట్టి సర్వవ్యాపకత్వమైన, పవిత్రమైన పూర్ణత్వమును తెలుసుకొనటానికి మార్గమేమిటి? పోనీ, సాధనలచేత దైవత్వాన్ని పొందటానికి వీలవుతుందా? అనేక విధములైన సత్కర్మలచేత దైవత్వాన్ని పొందుటకు సాధ్యమవుతుందా? కాదు కాదు. యజ్ఞయాగాదిక్రతువులచేతగాని, దాన ధర్మాది కర్మలచేతగానీ, శమదమాది సత్కర్మలచేతగాని, యమనియమాదిసాధనలచేతగాని, భజనపూజాదులచేతగాని, దైవాన్ని యెవ్వరుకూడా పొందలేరు. అదియే భగవద్గీతలోని 11వ అధ్యాయమునందు 53వ శ్లోకములో స్పష్టము గావించాడు, కృష్ణుడు. అయితే యీ సాధనలు దేనినిమిత్తమై? సత్యాన్ని గుర్తించిన పండితులు, మహనీయులు అనేకమంది



sri sathyasai vachanamrutam

అనేక సాధనలు సలుపుచున్నారు. దీనియొక్క అంతరార్థమేమిటి? దైవాన్ని దర్శించటానికి సాధ్యముకాని సాధనలు చేసి యేమి ప్రయోజనము? అయితే యీ సాధనలన్నికూడను మానవుని ఆవరించిన రాగద్వేషాది మాలిన్యములు తొలగించుకునే నిమిత్తమై యేర్పడినవి. ఈ మాలిన్యములను తొలగించుకొని తాను తానుగా జీవించటానికి ప్రయత్నించటమే సాధనలయొక్క అంతరార్థము.

**అనంతమైన సచ్చిదానంద స్వరూపమునుండి ఉద్భవించిన జీవతత్త్వమునందుకూడ యీ సచ్చిదానందములే ప్రకాశిస్తున్నవి**

మానవుడు సహజముగనే సచ్చిదానందస్వరూపుడు. 'సత్' అనగా త్రికాలములచేత బంధింపబడక నిరంతరము ఏకంగా నిలబెట్టేటువంటి తత్త్వమే! 'చిత్' అనగా బాహ్య, అంతరములయందు వుండిన సమత్వమును గుర్తించే మేధాశక్తియే! ఆనందమనగా నిత్యమై, నిరుపాధికమై, నిర్మలమై యే సుఖమైతే వున్నదో ఆ సుఖముయొక్క స్వరూపమే! అయితే సత్, చిత్, ఆనందము భిన్నభిన్నరూపములచేత భిన్నభిన్న ఖండములచేత కూడివుండటంచేత యీ మూడింటి యేకత్వాన్ని యేరీతిగా భావించగలము? భిన్నత్వము కన్పించినప్పటికి, యిందులో అంతర్లీనంగా వున్న యేకత్వమును నిరూపించటానికి ఒక చిన్న ఉదాహరణ. దీపమునకు ఉష్ణము, వెలుగు, ఎఱ్ఱటిరంగు అనే మూడు లక్షణములుంటాయి. యీ మూడు భిన్నముగా కన్పించినప్పటికిని దీపముయొక్క స్వభావము యీ మూడింటియొక్క చేరికయే! 'అనంతమైన యీ సచ్చిదానంద స్వరూపములో మానవత్వము పొందుటకు తగిన సాధనయేమిటి? ఈ అనంతమునకు, అల్పత్వమునకు యేవిధమైన సంబంధమేర్పడుతుంది? ఇది సాధ్యమా?' అని మనము సందేహించవచ్చు. కాని, యిట్టి సందేహములతో మనము బలహీనులు కారాదు. అనంతమైన సముద్రములో చల్లదనము, తెల్లదనము, తడి యీ మూడు సహజముగా వుంటాయి. ఈ అనంతమైన సముద్రమునుండి ఆవిర్భవించిన అలలయందుకూడను యీ మూడు గుణములు సమముగనే వుంటున్నవి. అదే విధముగనే అనంతమైన సచ్చిదానంద స్వరూపమునుండి ఆవిర్భవించిన జీవతత్వమునందుకూడను యీ సత్‌చిత్ ఆనందములనే

sri sathyasai vachanamrutam

నిత్యసత్యములు ప్రకాశిస్తూనే వున్నవి. ఈ అల్పత్వమనిగాని, అధికత్వమనిగాని భేదములకు మనము గురికారాదు.

## ప్రతి పదార్థమునందు సచ్చిదానందమనే దివ్యశక్తి అంతర్భూతమై యుంటున్నది

సర్వత్రానిండిన దివ్యత్వము సచిదానందస్వరూపమే! దీనినే దైవత్వమనికూడను చెబుతూవచ్చారు. 'దైవ' అనే పదమునకు 'సమిష్టి' అని అర్థము. సమిష్టి అనగా దృశ్యకల్పితమైన ప్రకృతియే! ఈ ప్రకృతి అంతయు దైవమాయయే! ప్రతి పదార్థమునందు యీ సత్‌చిత్‌ఆనందమనే దివ్యశక్తి అంతర్భూతమై వుంటున్నది. ఈ ప్రకృతి అనేది కేవలము శుద్ధచైతన్యముతోకూడి వుంటున్నది. కనుక, ప్రతిపదార్థమునందు అంతర్భూతమైవుండిన దివ్యశక్తియే సచ్చిదానందస్వరూపము. ప్రకృతి, సచ్చిదానందతత్త్వము యీ రెండింటియొక్క చేరికయే దివ్యత్వము.

ఈ సచ్చిదానందమనేది శాశ్వతమైనది. నిరంతరము వుండునటువంటిది. దైవమనగా matter+Being=GOD. ఇలాంటి దివ్యమైన తత్త్వాన్ని మనము అర్థము చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి. అయితే యిట్టి పరతత్త్వాన్ని గుర్తించటానికి అనేక విధములైనటువంటి ప్రతిబంధకములు వుంటుంటాయి. ఇందులో ప్రధానమైన ప్రతిబంధకములు నాలుగు. 1. అవిద్యాప్రతిబంధకము. 2. ప్రజ్ఞాప్రతిబంధకము. 3. కుతర్కప్రతిబంధకము. 4. విపర్యతురీయావస్థ లేక విపర్యదురాగ్రహము.

## నేను జీవుడను, పరతంత్రుడను అనే భావమే అవిద్యాప్రతిబంధకము

అవిద్యాప్రతిబంధకమనగా యేమిటి? 'నేను ఒక జీవతత్త్వాన్ని. నేను సర్వస్వతంత్రుడను కాను. నేను పరతంత్రుడను' అనే బలహీనభావమే! ఈ బలహీనత వుండినంతవరకు మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించుకోలేడు. రెండవది, ప్రజ్ఞా ప్రతిబంధకము. అనగా యితను యే పెద్దలు చెప్పినప్పటికి, యే మహనీయులు బోధించినప్పటికి, పవిత్రమైన భావములను చేకూర్చుకొనుటకు యేమాత్రము అంగీకరించడు. ఇతరులు చెప్పినమాట వినుటకు తనకు యేమాత్రము మనస్కరించదు. ఇది ప్రజ్ఞామాంద్యమనికూడను చెప్పవచ్చును. మూడవది కుతర్కము. అనగా పెద్దలు చెప్పిన ప్రతి విషయాన్నికూడను ఒక

sri sathyasai vahanamrutam

విరుద్ధమైన అర్థమును తీసుకోటం. దీనికి వ్యతిరేకార్థము గావించటము. విపర్యదురాగ్రహం అనగా నాకు సర్వము తెలుసు నాకు ఒకరు చెప్పనక్కరలేదు. నాకు బోధించే అధికారియేలేడు అనే దురాగ్రహముచేత మానవత్వాన్ని మరచి దివ్యత్వమును అర్థము చేసుకోటానికి ప్రయత్నించరు. దీనికి కారణం యేమిటి? జగత్తంతయుకూడను మాయాప్రభావమే! 'మాయ' అనగా లేనిదివుండినట్లుగా, వున్నది లేనట్లుగా అద్దములో చూచిన ప్రతిబింబమువలె కుడి యెడమగాను, యెడమ కుడిగాను కనుపిస్తుంది. ఇది అజ్ఞాన స్వభావముయొక్క చిహ్నము. ఇట్టివారు జగత్తును జగత్తుగానే చూస్తారు. కాని, అంతర్‌తత్త్వాన్ని గుర్తించిన వ్యక్తులు జగత్తును జగదీశ్వరునిగా భావింతురు. జగత్తు జగదీశ్వరునియొక్క ఆకారముతప్ప అన్యముకాదు. Matter contains energy. ఈ energy లేకుండా జగత్తు నిలుచుటకు వీలుకాదు. జ్ఞానాజ్ఞానములయొక్క దృశ్యములో ప్రవర్తించే ప్రవీణులే యీ ప్రహ్లాద, హిరణ్యకశిపులు. హిరణ్యకశిపుడు స్తంభమును స్తంభముగనే చూచాడు. ప్రహ్లాదుడు స్తంభమును నారాయణునిగా చూచాడు. కనుక, దివ్యత్వమునందు అనర్థాన్ని గుర్తించే అజ్ఞానులు యీనాడు అధికమై పోయారు.

**సమస్త సాధనలు మానసిక మాలిన్యమును తొలగించే ప్రక్రియలే!**

ఈ అజ్ఞానము పోవలెనన్న యిది ఒక ప్రత్యేకమైన పదార్థముకాదు. దైవత్వమునుపొందుటకు ప్రత్యేకసాధనలు చేయనక్కరలేదు. ఈ చేసే సాధనలన్నికూడను దైవనిమిత్తమై ఆచరించేవికాదు. తన నిమిత్తమై తాను ఆచరించేవి. దైవమునకు యెట్టి కర్మలను ఆచరించనక్కరలేదు. దైవము ప్రత్యేకముగా కనుపించదు. తనను ఆవరించిన రాగద్వేషాదిమాలిన్యములు పరిహారముగావించుకున్నప్పుడు తాను తానుగా ప్రకాశించుచున్నాడు. కనుక, సమస్తకర్మలు మానసిక మాలిన్యమును నిర్మూలముగావించే ప్రక్రియలే! ప్రతిమానవునియందు మాయతత్వము బ్రహ్మత్వము రెండింటియొక్క చేరికగావుంటున్నాది. ఈ మాయతత్వమనేది లేకపోతే బ్రహ్మత్వమును గుర్తించటానికి వీలుకాదు. బ్రహ్మత్వమే లేకపోతే మాయకు ఉనికే లేదు.

అనంతమైన సముద్రములో అలలు ప్రారంభమవుతున్నాయి. ఈ అలలకు యేదో ఒక



sri sathyasai vachanamrutam

కారణమువుండాలి. కారణములేకుండా యీ అలలు ప్రారంభము కావటానికి వీలుకాదు. జలమునందు వాయువు యేకము కావటముచేత అల అనే స్వరూపము ప్రారంభమవుతున్నాది. ఈ వాయువుయొక్క వత్తిడిచేతనే జలము అలగా మారిపోతున్నాది. వాయువేలేకుండిన జలము అలగా మారదు. ఈ వాయువే మాయ. జలమే అనంతమైన సచ్చిదానందస్వరూపము. అందులోనుండి ప్రారంభమైన అలలే, అంత్యముతోకూడిన యీ అలలే యీ జీవతత్త్వము. కనుక జీవతత్త్వమునకంతయు మాయ అనే వాయువే ప్రధానమైనటువంటిది. ఈ అలలు కేవలము ప్రతిబింబస్వరూపములేగాని బింబాకారములు కావు. ఎంతవరకు మనకు ప్రతిబింబము? అద్దము వుండినంతవరకు ప్రతిబింబము. అద్దమువేరు చేసిన, ప్రతిబింబము వేరవుతున్నది. కానీ బింబము యెప్పటికిని వుంటున్నది. ఈ దేహమునుండి అద్దమును వేరుచేసిన ప్రతిబింబముకూడను వేరవుతున్నది. కానీ బింబము యెప్పటికిని వుంటున్నది. మన దేహమే అద్దము. ఈ దేహమువుండినంతవరకే యిందులోని ప్రతిబింబమనే జీవతత్త్వమునకు గోచరమవుతుంది. ఈ దేహమనే అద్దము జీవతత్త్వమనే ప్రతిబింబము పోయినప్పుడు బింబమనే దివ్యత్వము నిరంతరమువుంటుంది.

**సంసారమును ప్రేమించవచ్చునుగాని, సంసారమునందు తగుల్కొనరాదు**

ఈ జగత్తంతయు మాయాస్వరూపముతో కూడినటువంటిది. ఇది కేవలము క్రీడనే! ఇందులో మనము వ్యవహారములను ఆచరించవచ్చునేగాని యిందులో మనము తగుల్కొనరాదు. సంసారమును మనము ప్రేమించవలసినదేకాని, అంటిపెట్టుకోతగినదికాదు. వాంఛించినచోట మైత్రికావచ్చునేగాని, మమత్వము పెంచుకోతగినటువంటిదికాదు. Not remunciation of action, it is renunciation in action. కర్మలను త్యజించటముకాదు, మనము చేయవలసినది. కర్మయందలి దోషములను మనము నిర్మూలము గావించుకోవాలి. మనము చేయవలసిన కర్మలు మనము చెయ్యాలి. కానీ యీ కర్మలయందుండిన దోషములను పరిహారము గావించుకొనుటకు ప్రయత్నించాలి. 'చిత్తస్యశుద్ధయే కర్మః'. ఈ కర్మలవల్ల మానసిక శుద్ధియేర్పడుతుంది. మంచి కర్మలకుగానీ చెడ్డ కర్మలకుగానీ మనసే ఆధారము. కనుక, మనసుయొక్క

sri sathyasai vachanamrutam

మాలిన్యములను మనము పరిహారము గావించుకొనుటయే మన ప్రధాన సాధన. కప్పబడిన తెరను మనము వదలించుకొన్నప్పుడు స్వస్వరూపము స్వస్వరూపముగానే వుంటుంది.

ఈనాడు గురుపూర్ణిమ. అనగా ఈనాడు చంద్రునియందు పదహారుకళలతో కూడిన పూర్ణత్వము నిండియుంటుంది. చంద్రునియొక్క ప్రతిబింబమే మనసు. మనసుయొక్క ప్రతిబింబమే చంద్రుడు. మనము పరిపూర్ణత్వాన్ని పొందవలెనన్న మనయందుండిన 16 కళలు మనము త్యజించాలి. ఏమిటి యీ పదహారు కళలు? కులమదము, బలమదము, యవ్వనమదము, సౌందర్యమదము, విద్యామదము, తపోమదము, రాజ్యమదము, ధనమదము, యివి అష్టమదములు ఉంటున్నాయి. యింక అరిషడ్వర్గములు ఆరు. కామక్రోధలోభమోహమదమాత్సర్యములు. ఇవి రెండూ కలసి 14. ఇక రజోతమో గుణములు. ఇవన్నీ చేరితే పదహారు. ఈ పదహారు గుణములు యేనాడైతే మనం దూరం గావింతుమో అప్పుడే మనం పవిత్రులమవుతాము. ఈ పదహారుకళలు మానవునియందు చేరటంచేతనే తాను కళావిహీనుడైపోతున్నాడు. కళాపరిపూర్ణమైన బ్రహ్మతత్త్వానికి అడ్డు తగులుతున్నాయి. చంద్రుడు తన కళలనంతా పెంచుకొనిపోయాడు. కానీ, మనం కళలను పూర్తిగా త్యజించటానికి ప్రయత్నించాలి. మానవత్వమందు యీ విధమైన దోషభావములు అభివృద్ధికావటంచేతనే తాను తానుగా ప్రకాశించలేకపోతున్నాడు.

**పంచక్లేశములు**

దీనికి ఐదు విధములైనటువంటి క్లేశములుంటున్నాయి. క్లేశములనగా బాధలు అనగా అడ్డులు. ఇందు మొట్టమొదటిది అవిద్యాక్లేశము. రెండవది అభినవక్లేశము. మూడవది అస్థితక్లేశము. నాల్గవది రాగక్లేశము. ఐదవది ద్వేషక్లేశము.

అవిద్యాక్లేశమనగా నేను జీవుడను, దేవుడనుకాదు; నేను స్వతంత్రుడనుకాను, నేను పరతంత్రుడను; బలహీనుడను అనే భావమే! ఇది మానవుని క్రమక్రమేణా బలహీనుని గావిస్తూవస్తుంది.

అభినవక్లేశమనగా యీ సంసారమునకు హేతువైన మనసును త్యజించుకోలేని



srisathyasaivachanamrutam

బలహీనుడుగా వుండటం. మనసే మన సర్వబంధములకు మూలకారణము, హేతువు. ఇట్టి మనసును మనము త్యజించుకోలేని బలహీనులుగా వుంటున్నాము. కనుకనే మనము అనేక విధములైన దుఃఖములకు, విచారములకు గురిఅవుతున్నాము.

మూడవది అస్థితక్లేశము. సర్వవిషయములు, సర్వసుఖములు అనుభవించాలి అనుభవించాలి, అనే దురాశయే అస్థితము. ఈ ఆశలు విఫలమాయెనా లోభము ప్రారంభమవుతుంది. దీనిని ఫలింపచేసుకుంటిమా అహంకారము ప్రారంభమవుతుంది. కనుక, వీని జయాపజయములవల్ల మానవత్వము క్రమేణా కృశించిపోతున్నదేకాని, క్షీణించిపోతున్నదేకాని, దీని పవిత్రత యేమాత్రం పెరగదు.

రాగక్లేశము ధనకనక వస్తువాహనాదులు లభించాలని అభిలషించటం. ఈ విధమైన క్లేశము మానవుని అనేకవిధములుగా వెనుకంజ వేయిస్తున్నది.

ద్వేషక్లేశము ఐదవది. ఉదరపోషణ నిమిత్తమై యితరులను ఆశ్రయించి తాను ఆశించిన ఫలము దక్కకపోవటంవల్ల వారిని దూషించటము. ఇది మానవుని మరింత హీనస్థితికి గొనిపోతున్నది. యిదే ద్వేషక్లేశము. ఈ ద్వేషక్లేశము మానవుని పరిపూర్ణత్వమునుండి హీనత్వానికి దింపుతున్నది. పక్షులలో కాకి చాలా హీనమైనదని అన్నారు. చాలా నీచమైనదిగా చూస్తూవచ్చారు. మృగములలో గాడిదను చాలా హీనముగా చూస్తూ వచ్చారు. కారణమేమనగా, కాకి పరిపక్వమైన ఫలమును యేనాడు ఆశించదు. చెడిన పదార్థములనే తాను రుచిచూస్తూవస్తుంది. గాడిద అశుద్ధమైన భారాన్నే మోస్తూ వుంటుంది. అది మలినమైన వస్త్రాలను మోస్తూ వుంటుంది. కనుకనే మృగములలోపల గాడిద చాలా హీనమైనదన్నారు. మనుషులలోపల నిరంతరము పరులను దూషించేవాడు, పరమనీచమైనవాడు అన్నారు. పక్షులలోపల కాకి, మృగములలోపల గాడిద, మనుషులలోపల దూషించేవాడు. కారణమేమనగా సర్వులయందువుండే సచ్చిదానందస్వరూపుని గుర్తించుకొనలేక, వ్యక్తిగా భావించి, మానవులమనే మనసుతో, రాగద్వేషాలతో దివ్యత్వాన్ని విమర్శించటం మహాపాపం. మానవత్వము అపవిత్రమైనదనికాని లేక హీనస్థితితో కూడినదనికాని, బలహీనమైనదనిగాని మనము



sri sathyasai vahanamrutam

భావించరాదు. మానవుడు సచ్చిదానందస్వరూపుడు. తాను నిరంతరము ఆనందముతో ప్రకాశిస్తూవుంటాడు. అయితే దానికి విరుద్ధమైన భావమును పెంచుకోటంచేత దైవము మనకి కన్పించకుండాపోతున్నాడు. దైవము ప్రత్యేకముగాలేదు. తానే దైవము. తానైవుండికూడను యీ రాగద్వేషాలనే మాలిన్యముచేత కప్పబడటంవలన తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. తనను తాను తెలుసుకోటమే సరియైనటువంటి తత్త్వము.

మనము యీనాడు చేసే సమస్త సాధనలు యీ తెరను తప్పించేటువంటి మార్గములే! దానిని తప్పించుకుంటే తాను తానుగానే వుంటున్నాడు. ఈ సత్యాన్ని మనం గుర్తించాలి. ఎన్ని సంవత్సరములు సాధన చేసినప్పటికి, ఎన్ని వేదాంతములు చదివినప్పటికి, మనసులోని మాలిన్యమే తొలగించుకొనకుండిన యివన్నియుకూడను కాలమును వ్యర్థము గావించినట్టుగానే వుంటాయి.

**గ్రంథములన్నియు గాలించి చూచిన**
**సత్యసాయిమాట సత్యబాట**
**వేదములన్నియు వెతికి చూచిన**
**సత్యసాయిమాట సత్యబాట**
**సకలశాస్త్రములన్నియు చదివిచూచిన**
**సత్యసాయిమాట సత్యబాట**
**గాయత్రిమంత్రము ఘనముగాచెప్పిన**
**సత్యసాయిమాట సత్యబాట**
**మనసుయందున్న మాలిన్యమట్టులెవుంచియేమి**
**చేసిన ఫలమేమి వెఱ్ఱిమనస?**

మనసులోని మాలిన్యమును యేనాడు మనము దూరము గావించుకొందుమో ఆనాడే మనం సరియైనరీతిలో అభివృద్ధిగాంచగలము.

**'నీవే నేను' అనే స్థితియే సర్వమతములసారము, సర్వశాస్త్రముల మూలము మరియు సర్వవేదముల గమ్యము**

sri sathyasai vacharamrutam

భగవద్గీతయందు 'నాకు నీవు శరణుకమ్ము' అని చెప్పలేదు. 'నీకు నీవు శరణాగతుడువుకా!' అని చెప్పబడింది. 'నీవు' అంటే యెవరు? ఆ సత్యమునే మనము గుర్తించాలి. 'త్వమేవమాతా చ పితాత్వమేవ' అని శ్లోకం చెపుతారు. 'నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే నా గురువు. నీవే నా స్నేహితుడు' అంటూవుంటారు. 'నీవే తల్లి, నీవే తండ్రి, నీవే గురువు, నీవే మిత్రుడు; కడకు 'నీవు' అనేది మిగిలిపోతుండాది. నీవు తల్లివి కావచ్చు, ఆ నీవెవరు? నీవే తండ్రివి, ఆ నీవెవరు? కనుక, 'నీవే తండ్రి, నీవే తల్లి. నీవే దైవము' అనే దానికి బదులు 'నీవేనేను' అంటే తీరిపోతుంది. 'నీవే నేను' అనే స్థితికి రావాలి. ఇదే సర్వమతములసారము, సర్వశాస్త్రముల మూలము, సమస్త వేదములయొక్క గమ్యము. కనుక 'నీవేనేను, నేనువేరు, నీవువేరు' కాదు. ఈ తల్లి, తండ్రి, గురువు, దైవము అనవసరంగా యెందుకీ బంధనాలన్నీ పెంచుకోటము? ఉన్న తల్లిని చూడటంలేదు. కానీ నీవే తల్లివి అని చెప్పి నన్నుకూడా చూడకుండా పోతున్నావు. ఈ బంధనాలన్నీ క్రమక్రమముగా తగ్గించుకుంటూరావాలి. కనుక యిద్దరియొక్క యేకత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. కేవలం యిద్దరియొక్క యేకత్వమేకాదు సర్వులయందున్నటువంటి యేకత్వాన్ని గుర్తించాలి.

**సర్వులయందు వున్న ఆత్మతత్త్వము ఒక్కటే అనే భావమును పెంచుకోవాలి**

ఇదే 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. ఆత్మతత్త్వమెక్కటే! ఎవరు నీవారు? ఎవరు నావారు? ఈ సంబంధము లెంతకాలము? క్షణభంగురము. ఎంతకాలమైనా శాశ్వతంగా వుండేది ఆత్మతత్త్వము. ఆత్మయే నావారు. అట్టి శాశ్వతమైన సంబంధ బాంధవ్యాన్ని మనం అభివృద్ధి పరచుకోటము అవసరము. కాని ఆ దిశగా మనం ప్రయత్నం చేయము. యిది కేవలము మాయయొక్క ప్రభావము. అన్నీ మనకు తెలుసు. అంతా చూచినాము. కాని, యీ చీకటి గదులోనే చిందులు తొక్కుతున్నాము. చీకటిలో దెబ్బ తగలక తప్పదు. ఆ చీకటిని దూరంచేసుకోవాలి. వెలుగును మనం పెంచుకోవాలి. అప్పుడే మనకు బాధలు తీరుతుంటాయి. చీకటిగదుల్లో యెంతకాలం జీవిస్తారో అంతకాలం మీకు దెబ్బలు తప్పవు అనే సత్యాన్ని గుర్తించాలి. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' అనగా

srisathyasaivachanamrutam

అందరియందును నా అంశమే అనే దైవాన్ని మనం విశ్వసించాలి. నీవు జీవాంశవుకాదు, పంచభూతాంశముగాదు. మమాంశ. మనసులో వున్న మాలిన్యాన్ని దూరంచేసినప్పుడు భగవంతుడు తనకు తానే సాక్షాత్కారమవుతాడు. తనను తాను తెలుసుకోవాలనే మానవుడు మొట్టమొదట మనసునందలి మాలిన్యాన్ని దూరంచేసుకోవాలి. ద్వేషభావాల్ని నిర్మూలం గావించాలి. ఏకత్వాన్ని పెంచుకోవాలి. అదియే నిజముగా యీనాడు దేశమునకు కావల్సిన ప్రధానమైన బలము. భాషాభిమానము, దేశాభిమానము, ప్రాంతీయాభిమానము, కులాభిమానము, మతాభిమానము యీ తుచ్ఛమైనటువంటి అభిమానములలో మునిగిపోవటంచేతనే ఆత్మాభిమానానికి దూరమైపోతున్నాము. మనము పెంచుకోవలసినది ఆత్మాభిమానమే! సర్వులయందు వున్న ఆత్మతత్త్వము ఒక్కటే! కనుక, సాక్షాత్కారమనగా యేదో సాధనలతచేత లభించే ప్రసాదముకాదు. తాను తానుగానే వున్నాడు. అనేక పర్యాయములు మీకు చెప్పాను. మన హృదయాన్ని మనం దర్శించాలంటే యేమి చెయ్యాలి? నేను చూచుకుంటే నాపైన వుండే వస్త్రం కన్పిస్తుంది. కాని నా హృదయం కన్పించదు. ఈ కప్పబడిన వస్త్రము తీసివేసినప్పుడే కదా హృదయమును చూడగలము!

### గుణాతీతుడైనప్పుడే సచ్చిదానంద స్వరూపునిగా రూపొందగలడు

యీనాటి మానవుడు యీ జగత్తు అనే చలి బాధకు ఓర్చుకోలేక మూడు దట్టమైన వస్త్రాలు కప్పుకున్నాడు. పైన మందమైన కోటు, లోపల షర్టు, క్రింద తేలికైన బనీను. ఈ మూడు కప్పుకోటంచేతనే మన హృదయం మనకు కన్పించటంలేదు. ఈ దట్టమైన కోటే తమోగుణము. లోపల వున్న షర్టే రజోగుణము. ఆయొక్క తేలికగా వుండే బనీనే సాత్త్వికము. ఈ మూడింటిని తీసివేసినప్పుడే మన హృదయం మనకు కనిపిస్తుంది. కనుక, నీవు గుణాతీతుడవైనప్పుడే సచ్చిదానంద స్వరూపుడుగా రూపొందుతావు. ఇన్ని గుణములు నీలో పెట్టుకొని సచ్చిదానందము, సచ్చిదానందమంటే యెట్లా లభిస్తుంది? చచ్చినా కన్పించదు. గుణాలను అన్నింటిని నిర్మూలం గావించాలి. దోషాలనంతా తుడిచి పెట్టాలి. అప్పుడే మన స్వరూపాన్ని మనము దర్శించగలము. సచ్చిదానందస్వరూపులారా! ఎంతకాలమైనా మనం కేవలం శ్రవణం చేయటం, కాలమును వ్యర్థము చేయటమే అవుతుంది. శ్రవణం

srisathyasaivahini.org

చేసినదానిని మననం చేయండి. మననం చేసినదానిని నిధిధ్యాసలో వుంచండి. అనగా కొంతవరకైనా ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. విన్నటువంటి విషయాన్ని కేవలం చిలుకలవలె పలుకుతున్నామే తప్ప దానిని రుచి చూడటంలేదు.

**మానవుడు పుట్టాడుగాని, మానవత్వం యింకా పుట్టలేదు**

అందరూ భక్తులుగానే కన్పిస్తున్నారు. కాని భక్తి తత్త్వమేమిటో వారికి అర్థంకావటంలేదు. భక్తి అంటే యేమిటి? ధ్యానం చేయటమా, భజన చేయటమా, జపం చేయటమా, యజ్ఞయాగాదిక్రతువులు చేయటమా? ఇవన్నీ భక్తి లక్షణములేకాదు. కేవలం చాకలివాడు చేసే పనులు. అనగా యేమిటి? మురికి వస్త్రములన్నిటిని వుతికి పరిశుద్ధము చేస్తున్నాడు. శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనమ్ ఈ నవవిధ భక్తి మార్గములన్నీ మనస్సును పరిశుద్ధం చేయటంకోసమే! వస్త్రాలను శుభ్రం చేసుకుంటున్నాము; కాని వాటిని ధరించటంలేదు. అదే మనలో పెద్ద లోపము. ఈ లోపమే లోభముగా మారిపోతున్నది. మనసును పరిశుద్ధము చేయాలి. పరిశుద్ధమైన మనసును ధరించాలి. అప్పుడే నీ స్వస్వరూపము నీవు గుర్తించటానికి వీలవుతుంది. నీవు నీవుగానే నిలువగలవు.

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా**
**పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా**
**పులిచర్మము కప్పిన గాడిద తాపులియగునా**
**ఏనుగంతబలిసియున్న పంది యేనుగవునటయ్య**

మనము మనిషి రూపం ధరించాము. అయితే, రూపాన్ని ధరించినంతమాత్రమున మనం మనుషులము కాలేము. మానవత్వాన్ని పొందినప్పుడే మనం మనుషులమవుతాము. లోకమునకు మానవునిగానే కనపడుతున్నాము. కాని మానవతా గుణమనేది మనలో కన్పించటంలేదు. కొన్ని లక్షల సంవత్సరముల క్రితమే మానవ జన్మ ప్రారంభమైంది. కాని, మానవత్వం యింకా పురిటి బాధలతోనే వుంది. దానికి యింకా birth రాలేదు. మానవుడు పుట్టాడు కాని మానవత్వం యింకా పుట్టలేదు. ఏనాడు మనయందు మానవత్వం

sri sathyasai vachanamrutam

పుట్టించుకోగలమో ఆనాడే మనం మానవులము కాగలం. ఆ మానవత్వమే దైవత్వము. అదే సత్యస్వరూపము. అదే ధర్మస్వరూపము. అదే ప్రేమ స్వరూపము. అదే శాంతి స్వరూపము. ఇలాంటి స్వరూపాన్ని మనము ధరించినప్పుడే మనం మానవులము, మానవులము అని చెప్పుకునేందుకు అధికారముంటుంది. ఆ మానవత్వాన్ని మనం పొందుతే చాలు. అదే దివ్యత్వము, అదే పవిత్రము.

**స్వస్వరూపమును దర్శింపజేయగలవాడే విహితగురువు**

గురువు అంటే యీ లౌకికమైనటువంటి గురువుకాదు. గురువులు ఎనిమిది విధములుగా వుంటున్నారు బోధగురువు, వేదగురువు, నిషిద్ధగురువు, కామ్యగురువు, సూచకగురువు, వాచకగురువు, కారణగురువు, విహితగురువు. ఆ అష్టవిధములైన గురువులలోపల విహితగురువు ఒక్కడు మాత్రమే సరియైనటువంటివాడు. కొందరు శాస్త్రాన్ని బోధించవచ్చు. తత్వాన్ని విచారణ సల్పవచ్చు. యమ, నియమాది సాధనలు బోధించవచ్చు. అభీష్టకార్యములకు తగిన పూజలు గావింపవచ్చు. వ్రతములు చేయించవచ్చు. కాని మానవునియందున్న సందేహములను నిర్మూలముగావించి, స్వస్వరూపాన్ని సందర్శింపచేసేవాడు ఒక్క విహితగురువు మాత్రమే! ఆ విహిత గురువు దైవము ఒక్కడు తప్ప, యితరులుకాదు. ఈనాడు గురుపూర్ణిమ. గురువులకు పూజలు చేయటం, దక్షిణలు సమర్పించటం, కానుకలు యీయటం, యివికాదు నిజమైన గురుపూజ.

'గు' కారమనగా అంధకారమైన దానిని నిర్మూలంగావించాలి. ప్రకాశమును దేదీప్యమానముగా వెలిగించాలి. 'గు' కారమనగా గుణాతీతుడుగా వుండాలి. 'రు' కారమనగా రూపరహితుడుకావాలి. ఆ రూపనామములు లేని తత్త్వము దైవము ఒక్కటే. ఒక చిన్న ఉదాహరణము. స్వామి భస్మాన్ని యిస్తూవుంటాడు. అనేక మంది భస్మాన్ని ధరిస్తుంటారు. దీనియొక్క అంతరార్థమేమిటి? రూపనామములతో చేరిన ఒక పదార్థాన్ని కాల్చివేసినప్పుడు అది భస్మంగా మారిపోతుంది. ఈ భస్మం రూపనామ రహితమైపోతుంది. అట్టి రూపనామ రహితమైన భస్మమే అద్వైతము. కనుక అద్వైతుడివి కమ్మనే నీకు భస్మాన్ని

sri sathyasai vachanamrutam

అందించటం. ఈ రూపనామములనేదానిని కొంతవరకు నిర్మూలనం గావించుకోమనే యీ భస్మాన్ని అందించటం. ఈ భస్మం యెక్కడనుండి వచ్చింది? ఒక రూపనామము ధరించిన వస్తువుయొక్క క్షీణస్థితియే. ఆ రూపనామాల్ని మనం నిర్మూలం గావించుకున్నప్పుడే భస్మంగా తయారైంది. అనగా రూపమునందున్న అహంకారము, నామమునందున్న మమత్వము నిర్మూలము చెయ్యాలి.

**'చెప్పింది చేయి; చేసింది చెప్పు'**

ఈనాడు అద్వైతము, అద్వైతము అని మనము చెబుతున్నాము. జీవితమంతా ద్వైతములోనే బ్రతుకుతున్నాము. చెప్పటం ఒకటి, చేయటం మరొకటి. ఇందులోనే మానవత్వం క్షీణించి పోతోంది. చెప్పింది చేయి, చేసింది చెప్పు. యీ యేకత్వాన్ని మనం అనుభవించాలి. ఇలాంటి గురువులు యీనాడు కరువై పోయారు. యీనాడు యీ గురుత్వానికి మనం ప్రాకులాడనక్కరలేదు. మనలో ఒక గురి వుంటున్నాది. ఆ గురియే మన నిజమైన ఆత్మతత్త్వము. దీనినే సాక్షీ భూతుడంటారు. దీనినే మనం అనుసరించాలి. నీ ఆత్మసాక్షిగా నీవు యీ కర్మలలో ప్రవేశించు. ఇక్కడ మూడు విధములైన మాయలుంటున్నాయి. స్వేచ్ఛ, పరేచ్ఛ, అయిచ్ఛ. స్వేచ్ఛ అనగా తాను సంకల్పించుకున్న కార్యములో కలిగే సుఖదుఃఖములను తాను అన్ని విధములా అనుభవించుటకు సిద్ధముగా వుండటమే! పరేచ్ఛ అనగా యితరుల ప్రోత్సాహ, ఉత్సాహములచేత ఒక కార్యములో ప్రవేశించి తద్వారా ఒనగూడే సుఖదుఃఖములను నోరుమూసుకొని అనుభవించటం. ఇంక అయిచ్ఛ అనగా దైవేచ్ఛగా మారటం. సుఖము జరగనీ అది దైవేచ్ఛనే. దుఃఖము సంభవించనీ అదీ దైవేచ్ఛగా భావించుకోటమే నిజమైన యిచ్ఛ. స్వేచ్ఛ, స్వేచ్ఛ అంటే స్వేచ్ఛకు అర్థమేమిటి? ఇష్టానుసారము కుక్కలు తిరిగినట్లు తిరగటమా స్వేచ్ఛ? మానవత్వమును వీడి సంచరించటమేనా స్వేచ్ఛ ? దివ్యత్వానికి దూరమై దానవత్వాన్ని అనుభవించటమేనా స్వేచ్ఛ? దీనికే యీనాడు మీకు అంతరార్థమును చెప్పాలని తలచుకున్నాను.

**కలియుగములో దేవతలు, రాక్షసులు ఒకే దేహంలో ఉంటున్నారు**



sri sathyasai vachanamrutam

త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము మూడు యుగములనుండి చూస్తున్నాము. త్రేతాయుగములోపల దేవతలంతా ఒక వైపున వుండినారు. దానవులంతా మరొక వైపున వుండినారు. శ్రీరాముని కాలములోపల దేవతలందరు అయోధ్యలో, కిష్కింధలో జీవిస్తూ వచ్చారు. కనుక రాముడు స్వయము తాను యుద్ధములో ప్రవేశించి రాక్షసులందరిని హతమారుస్తూ వచ్చాడు. దేవతలను రక్షిస్తూ వచ్చాడని దీనియొక్క అంతరార్థము. ద్వాపరయుగములోపల దేవతలు, రాక్షసులు యిరువురూ ఒకే రాజ్యములో నివసిస్తూ వచ్చారు. అనగా పాండవులు, కౌరవులు ఒకే రాజ్యానికి అధికారులు. ఇలా యిరువురు చేరిన సమయములోపల కృష్ణుడు యేమి చేశాడు? తన సైన్యాన్ని అంతా కౌరవులకిచ్చాడు. తాను అస్త్ర సన్యాసియై పాండవులకు సహాయము చేస్తూ వచ్చాడు. యుద్ధము చేయలేదు. కలియుగములో యీ రాక్షసులు, దేవతలు యెట్లా వున్నారంటే ఒకే దేహములోనే వున్నారు. త్రేతాయుగయులో దేవతలలోకము వేరు, రాక్షసలోకము వేరు. ద్వాపరయుగములో దేవతలదీ, రాక్షసులదీ ఒకే లోకము. కలియుగములో దేవతలది, రాక్షసులది ఒకే దేహము. త్రేతాయుగములో భగవంతుడు తాను స్వయముగా యుద్ధము చేస్తూ వచ్చాడు. ద్వాపరయుగములో తాను యుద్ధము చేయకుండా సాక్షీభూతుడుగా, నిమిత్తమాత్రుడుగా కూర్చున్నాడు. అయితే యుద్ధములో ప్రవేశించాడు. కలియుగములో రెండూ ఒకే దేహములో వుండడంవల్ల భగవంతుడు కేవలం తటస్థుడుగా వుంటుంటాడు. ఈ విచారణశక్తిని మానవుడు మానవుడుగానే గుర్తించుకోవాలి. ఈ బాధ్యత మానవునికే అందించాడు. తనలోవుండే దానవత్వాన్ని తన విచారణచేత తాను దూరం గావించుకోవాలి. తనయందున్న దైవత్వాన్ని తను పోషించుకుంటూ రావాలి. కనుకనే మానవునికి స్వతంత్రమును అందిస్తూ వచ్చాడు. అలాంటి స్వతంత్ర్యాన్ని పొందిన మానవుడు తాను యేమి చెయ్యాలో యేమి చేయకూడదో కనుగొనలేక దానవత్వాన్ని పెంచుకోటం, దైవత్వాన్ని విస్మరించటం జరుగుతూవస్తున్నాది. ఇదే కలియుగముయొక్క ప్రభావము. ఈ కలియుగమునందు దానవత్వాన్ని మనకు మనమే సంహరించాలి. ఈ దానవత్వాన్ని మనము యేనాడు సంహరిస్తామో ఆనాడు దైవత్వం తనకు తానే ప్రకాశిస్తుంది. మన సాధనలన్ని మనలో వుండే మాలిన్యాన్ని మనం దూరం చేసుకొనే ప్రయత్నంగా మనం

sri sathyasai vahanamrutam

విశ్వసించాలి.

**సర్వమునకు మూలాధారమైన తత్త్వమును మనం గుర్తించాలి**

ప్రేమస్వరూపులారా! దైవత్వాన్ని మనం చూడాలనుకుంటే, దైవత్వాన్ని సందర్శించాలనుకుంటే మనం ప్రత్యేకించి యే సాధనలు చేయనక్కరలేదు. మనసులోని మాలిన్యాన్ని తొలగించుకోటానికి చేసే ప్రక్రియలన్నీ ఒక విధమైన సాధనలుగా భావిస్తున్నాము. అవి కేవలము మాలిన్యాన్ని నిర్మూలనం గావించేవి కాని. మాధవత్వాన్ని సృష్టించేవికాదు. ఈ మాధవత్వము సృష్టించబడేటువంటిదికాదు. సహజంగా ప్రకాశించేది. అది స్వయం ప్రకాశంగా వుంటున్నాది. స్వస్వరూపంగానే వుంటున్నాది. కానీ అడ్డును మాత్రం మనం తీయాలి.

ఒక శిల్పి ఒక శిలను అనేక విధములుగా మలిచి ఒక విగ్రహాన్ని తయారు చేస్తాడు. కాని యీ శిల్పి ఆ శిలనుండి ఒక విగ్రహాన్ని తీయలేదు. ఈ విగ్రహము ఆ శిలలో పూర్వమే వుంటున్నాది. ఈ శిల్పి చేసిన పనియేమంటే దాని scrap అంతా తీసేశాడు. ఆ విగ్రహం తాను తయారు చేసిందికాదు. యీ విగ్రహము పూర్వము శిలలో వుంటుండాది. యీ scrapను తీసేటప్పటికి శిల, శిల్పరూపము ధరించింది. అయితే యి scrap దానితో చేరినటువంటిదే. ఒక చక్కని ఉదాహరణము. ఒక తోటలో ఒక పెద్ద గుండు వుంటున్నాది. శిల్పి ఆ గుండుపై కూర్చొని అనేక విధములుగా మలచి విగ్రహాన్ని తయారుచేసి ఆ ముక్కలంతా తోటలోనే పారవేశాడు. పూర్వము యిదంతా ఒక గుండుగా వుండినటువంటిది. ఇప్పుడు ఆ గుండు అనేక ముక్కలుగా తయారైపోయింది. ఆ ముక్కల్లో ఒక పెద్దముక్కను కృష్ణునిగా తయారుచేసి దేవాలయములో ప్రతిష్ట చేశాడు. ఈ విగ్రహమునకు యిక్కడ షోడశోపచారములు జరుగుచున్నవి. కానీ ఆ ముక్కలను మాట్లాడించేవారులేరు. మాట్లాడించేవారు యెవ్వరు లేనప్పటికి ఆ ముక్కలు చెబుతున్నాయి. 'తత్త్వమసి'. ఆ దేవాలయములో ప్రతిష్టయైన విగ్రహము మేమే అంటున్నాయి. అనగా అన్నీ యేకస్వరూపముగానే వుండినాయి. ఒక ముక్క దేవాలయములో కూర్చోవచ్చు. యింకొక ముక్క యేదో ఒక పరికరముగా వుపయోగపెట్టుకోవచ్చుకానీ యీ ముక్కలయొక్క

sri sathyasai vahanamrutam

ప్రభావములు, యీ ముక్కలయొక్క పరికరములు వేరువేరుగా వుండిన మాత్రమున రాయి రాయేకదా! కనుక, ఆ మూలాధారమైన తత్త్వమును మనము గుర్తించాలి. కనుకనే తొక్కేదిరాయి. మ్రొక్కేది రాయి, కట్టేది రాయి, కొట్టేది రాయి, మూలాధారతత్త్వముగా రాయి తత్త్వము ఒక్కటే.

**మన దృష్టిని మార్చుకోవాలిగాని సృష్టిని మార్చడానికి ప్రయత్నం చేయకూడదు**

అదే విధముగనే ప్రతి పదార్థమునందు సచ్చిదానందస్వరూపము వుంది. అదే 'అస్తి, భాతి, ప్రియం' అన్నారు. సత్, చిత్, ఆనందము ఈ మూడూ దైవ స్వరూపమే! దీనికి మనము రూపము, నామము కలుపుతూ వచ్చాము. సత్, చిత్, ఆనందము, రూపము, నామము యివి పంచకముగా మారినాయి. ఈ పంచకమే ప్రపంచము. రూపనామములు తీసివేస్తే అదే అద్వైతము. రూపనామములుంటే యిదే ప్రపంచము. కనుక, మన దృష్టిని మార్చుకోవాలిగాని సృష్టిని మార్చడానికి ప్రయత్నం చేయకూడదు. రూపనామములపైన దృష్టిని మార్చుకోండి. సత్య, నిత్య, నిర్మలమైన సచ్చిదానందముపైన దృష్టిని పెంచుకోండి. ఏమి చేసినా దైవముయొక్క సేవగానే, యేమి చూచినా దైవముగానే దర్శించాలి. సర్వమునందు వున్నటువంటి దైవత్వము ఒక్కటే. ఇట్టి సత్యమును గుర్తించటానికి ప్రయత్నించండి. ఎంతకాలమైనప్పటికి ద్వైతమునందే జీవితమును వ్యర్థము చేసుకోకండి. మనము చేసిన సాధనలయొక్క ఫలితము యేమిటి? ఇంతకాలము మనము చేసిన పూజల ఫలితమేమిటి? ఇంతకాలము మనము శ్రవణము చేసిన బోధల ఫలితమేమిటి? ఏమీ ప్రయోజనములేదు. ఏ కించిత్తైనా ఉన్నతస్థాయికి పోవటానికి ప్రయత్నించాలి. ద్వైతమునుండి విశిష్టాద్వైతములోనికి ప్రవేశించండి. విశిష్టాద్వైతములోనుండి అద్వైతములోనికి ప్రాకండి. అంతేగానీ జీవితమంతాకూడను కంబళిమాదిరి యెక్కడ వేసింది అక్కడే వుంటే ప్రయోజనములేదు. కనుక, మనము వున్నందుకు, సాధన చేసినందుకు, గ్రంథాలు చదివినందుకు, పెద్దలను దర్శించినందుకు, వారి వాక్యములు శ్రవణము చేసినందుకు తగిన ఫలితాన్ని మన అనుభవములోకి తెప్పించాలి.

**సత్యసారము తెలుసుకోరన్నా....**

sri sathyasai vachanamrutam

ఈ తత్త్వమెరిగి జన్మమెుందన్నా ॥సత్యసారము॥
ఈ ధర్మ మెరిగి మన్ననొందన్నా
పామరత్వము పాడు చేసి
నియమనిష్టలు యెత్తి నిల్పి
(తెలుసుకోకుండా వుంటే యెట్లా)
సత్యసారము తెలుసుకోరన్నా...
దేహభావము వీడరోరన్నా
అందమెందు యిందు లేదన్నా
అందమైన ఆత్మ విడచి
నింద్యమైన తనువునేనని
తలపు వీడి శాశ్వతముగ
తత్త్వభావము యెరుగరోరన్నా
సత్యసారము తెలుసు కోరన్నా...

(తేదీ 11-07-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)

sri sathyasaivachanamrutam